


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

## 119

### (31 ' జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ముద్దుల్ని** గురించిన వార్తలు, వాఖ్యానాలూ ఇటీవల అధికంగా ప్రచారంలోకి వచ్చాయి. 'సినిమాలో ముద్దులు' అనే సమస్య వచ్చిన తర్వాత వ్రాతల్లో ఆపడం కొంచెం హద్దులు దాటే సంచరిస్తోంది.

'ముద్దు' అనేపదం అదివరలో చాలా అరమరికతో వాడబడుతూ వుండేది గనుక హద్దులు చెరిగిపోయేవి కావు. 'ముద్దు' శబ్దాన్ని ఫలానా కవి చాలా 'ముద్దుగా' ప్రయోగించాడు అని ఒకాయన పేర్కొన్నాడు.

పూర్వ కవులు కొంచెం శృంగార ఘట్టాల్లో విశృంఖలంగా ప్రవర్తించిన మాట నిజమే అయినా ముద్దు మీద గల ఆంక్షను తొలగించలేదు. అయితే కాంక్షను కొంచె ఎక్కువగా వెలిబుచ్చుతూ వుండేవారు. చూడండి ఒక కవిపుంగవుని ఆసక్తి.

"ఒక ముద్దిచ్చిన చాలు, సర్వధరణి యోత్కృష్ట పాలనబాగ్యంబది గల్గెనంచు నేనుల సింతు హర్షింతు, నే నకలంకోజ్జ్వల ఖ్యాతిగాంతునటలా!" అంటూ వ్రాసుకున్నాడు.

ఒక్క ముద్దుకే సామ్రాజ్యమేలినంత భాగ్యం కలిగిందని మురిసిపోతాడుట. అకలంకోజ్జ్వలఖ్యాతి సంపాదిస్తాడుట. ఈ పద్యం చదువుతుంటే ఆ కవి ఎంత కరువువాచిపోయాడోననిపిస్తుంది.

"ఒనర చాలును బ్రతుకున కొక్క ముద్దు."

అని మరో ప్రముఖ కవి వ్రాసుకున్నాడు. ఈ పాదం చదువుతుంటే అతగాడు చాలా అల్పసంతోషి అనిపిస్తుంది. మరొక్కసారి చదివి చూస్తే ఒక్కదానితోనే మొఖం మొత్తింది గావన్ను పాపం అనిపిస్తుంది. మరోసారి ఆలోచిస్తే "జీవితంలో అలా మొక్కుకున్నాడు కాబోలు ఆ భక్తుడు" అనిపిస్తుంది.

"ముద్దులొలికెడు చెక్కిట" అని వర్ణిస్తూ వుంటారు. ఒకరు పెట్టడందాకా అవసరం వుండదన్నమాట. అక్కడ మంచి ముద్దుల వర్షం కురుస్తూనే వుంటుంది. వుంటుందన్నమాట. బహుశః పూర్వజన్మ వాసనకు చెందిన సౌభాగ్యమై వుండాలది. కొన్ని ముద్దుల్ని మూటగట్టే మొఖాలుంటాయట. అవి ఎంతెంత మూట కడతాయో, ఎలా కడతాయో వర్ణించలేదు. అదంతా 'ఆటోమేటిక్ ప్రాసెస్' అయివుంటుంది.

ఏదో సినిమా పాటలో నడుముకు ముద్దు, చేతికి ముద్దు అంటూ ఒక బైలాజికల్ బేరీజు వేశారు. ఇన్ని వివరాలు చెప్పలేక గాలిబ్ "నీ అడుగుజాడలు ముద్దాడుకొందు" అన్నాడు. దీనివల్ల అట్టే ప్రమాదం లేదు. అల్లరీ లేదు. మళ్ళీ ప్రేమ పిపాస పరాకాష్ఠ అందుకునే వర్గమది.

కొన్ని సినిమాలలో హీరోలు, అవతల కనిపించే ప్రణయమూర్తి, దూరంగా వెళ్ళిపోతుందన్న ధైర్యం ఏర్పడిన తర్వాత ఆమె వెళ్ళిన దిక్కుగా చూచి గాలిని గట్టిగా ముద్దాడి మురిసిపోతూ ఉంటారు. ఇది అంత ఆరోగ్యకరం కాకపోయినా అహింసాపూరితమైన చర్య.

ఇది ముద్దు పదం. పాపాయి, రూపాయి, అందరి ఆశీర్వచనం. ఇత్యాదులకు పరిమితమై వుండేవి. అందువల్ల ఆ పదం వాడటం కూడా పండుగ్గా వుండేది.

"ముద్దు పాప మూడు జన్మల వరం అని కన్నతల్లి ఆనందిస్తూంటే "పాప చెక్కిలి ముద్దాడ శాపమేమో" అని బిడ్డలు లేని తల్లి విలపించేది.

"ముద్దు ముద్దుగ రారా గోపాలం

నా కివరా ఒక చిన్నముద్దు గోపాలం!

అని యశోద తన జీవితభాగ్యాన్ని అలా కొల్లగొట్టుకోవడానికి ప్రయత్నించేది.

"చెంచుక్రో చేత

చిన్న మురళిచేత

నవ్వుతూ వచ్చేటి

నా చిన్ని కృష్ణా!

అమ్మకో ముద్దిచ్చి ఆడుకోవోయి"

అని ఆ బాలగోపాల దివ్యసుందర విగ్రహం చూచి తన్మయురాలై ఒక తీయటి ముద్దుకోసం అలా తహ తహలాడిపోయేది.

అడిగిందే, నిన్నడిగిందే

ఆ ముసలి గోపిక

నన్ను ముద్దడిగిందే!

వద్దని చెప్పమ్మా!

అడగొద్దని చెప్పమ్మా!

ఆ ముసలి గోపిక

నన్ను ముద్దడిగిందే

పడుచు గోపికలు ఫక్కున నవ్వారే!

వద్దని చెప్పమ్మా!

నన్నడగొద్దని చెప్పమ్మా"

అని రసికశిఖామణి అయిన బాలగోపాలుడు, నేరనివాడికి మల్లె మనసు మారినవాడికి మల్లే తల్లికి ఫిర్యాదు చేయడంలో ఎంతో చమత్కారం వుంది. మన గేయాలలో, పదాలలో ఇలాటి భావాలెన్నో వెన్నలతోరణాలుగా దర్శనమిస్తూ, తృప్తి కల్పిస్తూ, భక్తిని పండిస్తూ వుంటాయి. ఇలాటి తావుల్లోనుంచి, 'ముద్దు' పదం అనేక సారస్వత శాఖల్లోకి రవాణా అయిందీనాడు.

ఈడొచ్చినవాళ్ళు - ఆడవాళ్ళు కానివ్వండి, మొగవాళ్ళు కానివ్వండి బహిరంగంగా ముద్దు అనేమాట విన్నప్పుడు చెంపను రక్కి కొట్టినట్లు బాధపడేవారు. సిగ్గుతో తలొంచుకుని ఎక్కడికో పారిపోయేవారు. ఇప్పుడేం వుంది? ఎక్కడ పడితే అక్కడ వినిపిస్తోంది, కనిపిస్తోందామాట.

ఎన్నిమాట్లు తలవంచుకుని, ఎక్కడకని పారిపోతారు? కొన్నాళ్ళు నుంచున్న చోటే పెడముఖం పెట్టడం ప్రారంభించారు. తర్వాత ఆ మెడ నొప్పులుకూడా దేనికి? అంతమాత్రంతో ఈ కీడు తొలుగుతుందా ఏమన్నానా అని వినీవిననట్లు అభినయించడంలోకి దిగారు.

కొద్దిరోజులకు మన పౌరసత్వంలో కూడా ముద్దుల పురాణాలు, ప్రభంధాలు వెలువడితే ఆశ్చర్యపడవలసిన అవసరం వుండదు. ఈ లోపల "వెండి తెరముద్దులు" చాలావరకు హృదయాలకు అలవాటుచేసి అట్టిపెడతాయి కదా!

చిలకలు, చిన్నపిల్లల విషయంలో 'ముద్దు' అనే పదం స్వేచ్ఛగా వాడబడుతూ వచ్చేది. వారివే ముద్దుపలుకులు క్రింద జమపడినాయి. రామచిలుక కిచకిచలో ఎంతో సంగీతం వుంది. అది వల్లించడంలో అంతులేని ముద్దు కనిపిస్తుంది. మన సారస్వతం తిరగవేస్తే "ముద్దుపాప" వంటి పదాలు కనిపిస్తాయి గాని "ముద్దుప్రౌఢ" "ముద్దు సుందరి" వంటివి మృగ్యంగదా! ముందు ముందు ఇలాటి పదాలక్కూడా గిరాకీ హెచ్చుతుందేమోనని సందేహంగా వుంది.

మానసిక ఆనందానికి ఒక సాంకేతిక ముద్దు అని పేర్కొన్నారు పెద్దలు. అనురాగానికి, ఆనందానికి ఆనవాలని కొందరు ఉటంకించారు. ముందు రాను రాను ఒక చిలిపి చేష్టగా కూడా తయారైంది. ఆధ్యాత్మిక భావాన్ని వెలిబుచ్చిన సంఘటనలు కూడా కొన్ని ఉన్నాయి.

సత్యవంతుడు - సావిత్రీ ఆదర్శ ప్రణయమూర్తులు. అరవిందులు రచించిన సావిత్రి గ్రంథంలో ఇలా వ్రాయబడి వుంది. సత్యవంతుడు కట్టెలు కొడుతూ, అది నెత్తిన పడి పడిపోతాడు. సావిత్రి దుఃఖంతో పరిగెత్తుకు వస్తుంది. అప్పుడు సత్యవంతుడంటాడు" "ప్రేమమూర్తీ! ఒక్కసారి నన్ను ముద్దాడు. మళ్ళీ ప్రాణం వస్తుందేమో?" అని.

ఆ పవిత్రమూర్తి ముద్దు సంజీవివంటిదని అరవిందుల భావం. ఇది ఆధ్యాత్మిక భావనకు జరీ అంచులాంటిది. అలాటి చుంబనాన్ని చులకన చేయడం వరకూ వచ్చింది దాని చరిత్ర. ఈ చరిత్రకు సంబంధించిన ఘట్టాలు మరికొన్నింటిని తర్వాత వివరిస్తా.

Post your comments